సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 6 । జూన్ । 2025



గంగమ్మకు పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో గంగా నవరాత్రోత్సవాలు గురువారం ముగిశాయి. గోదారమ్మకు విశేష పూజలు నిర్వహించారు.



ఎస్టీ రోస్టర్ విధానంపై తనిఖీ

గోదావరిఖని: సింగరేణిలో అమలవుతున్న ఎస్టీ రోస్టర్ విధానం అమలుపై గురువారం ఆర్జీ–2 ఏరియాలో లైజనింగ్ అధికారి కృష్ణయ్య, ఇన్‌చార్జి జీఎం రాముడుతో కలిసి తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

న్యాయవాదుల సమస్యలపై కేబినెట్‌లో చర్చించండి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

మంథని: రాష్ట్ర కేబినెట్‌లో న్యాయవాదుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ న్యాయవాదుల బృందం గురువారం హైదరాబాద్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.10 లక్షల వరకు హెల్త్ కార్డులు పునరుద్ధరణ చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేలు స్టైఫండ్, ఇళ్ల స్థలాలు, రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో దివ్యాంగులైన న్యాయవాదులకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయం తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పొన్నం రవీందర్, రాష్ట్ర కన్వీనర్ ఇనుముల సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలె నర్సింహ, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆంటోనిరెడ్డి, కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభ్యున్నతి సాధించేందుకే మహిళాశక్తి



మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలన్న ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మహిళాశక్తి పథకం కింద మంజూరైన క్యాంటీన్‌ను గురువారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి వచ్చే వారికి క్యాంటీన్ ద్వారా రుచి, శుచికరమైన పదార్థాలు అందించాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, డీఆర్‌డీవో కాళిందిని, మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, నాయకులు మల్లయ్య, సంపత్, శ్రీనివాస్, ఉప్పు రాజు, బొంకూరి అవినాష్, జడల సురేందర్, జగదీశ్ తదితరులున్నారు.

నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

ఓదెల(పెద్దపల్లి): గ్రామాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. గురువారం మండలంలోని కొలనూర్ గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలోని నర్సరీ, సెగ్రిగ్రేషన్ షెడ్డు, శ్మశానవాటికను పరిశీలించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. ఎంపీవో షబ్బీర్ అలీ, కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను బడిబాట పట్టించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పించేలా విద్యార్థులను బడిబాట పట్టించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం డీఈవో మాధవి, సంబంధిత అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ నెల 6 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించి బడీడు పిల్లలంతా సర్కారు బడుల్లో చేర్పించేలా తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాలన్నారు. గతేడాది జిల్లాలో బడిబాట కార్యక్రమం ద్వారా 2,099 మంది విద్యార్థులను చేర్పించినట్టు గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తొలిరోజునే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. 10,186 మంది నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి విద్యనందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచేందుకు స్వశక్తి మహిళలు సైతం తమవంతు సహకారం అందించాలన్నారు. జెడ్పీసీఈవో నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య తదితరులున్నారు.

ఫిట్‌నెస్‌పై అశ్రద్ధ

స్కూల్ బస్సుల కండీషన్ చెక్ చేయించుకోవడంలో యాజమాన్యాల నిర్లక్ష్యం

- జిల్లాలో 273 బస్సులకు ఫిట్‌నెస్ చేసుకున్నవి 125 మాత్రమే..
- వారం రోజుల్లో తెరుచుకోనున్న పాఠశాలలు



స్కూల్ బస్సు ఫిట్‌నెస్ తనిఖీ చేస్తున్న ఆర్‌టీఏ సిబ్బంది

సాక్షి, పెద్దపల్లి: ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు అడ్మిషన్లు, ఫీజు వసూళ్లపై చూపిస్తున్నా శ్రద్ధ బడి బస్సులపై చూపడం లేదు. రోజూ ఉదయం, సాయంత్రం వేళలో విద్యార్థులను పికప్, డ్రాప్ చేయడం కోసం ఉపయోగించే బస్సుల భద్రతపై యాజమాన్యాలు నిర్లక్ష్యం చూపుతున్నాయి. తాజాగా రవాణాశాఖ ఫిట్‌నెస్ టెస్టుకు ఆసక్తిచూపకపోగా, వచ్చిన బస్సుల్లో అనేక నిబంధనలు ఉల్లంఘిస్తూ పిల్లల రక్షణకు సంబంధించి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొంతమంది ఫిట్‌నెస్ తనిఖీ సమయాల్లో నిబంధనలు పాటిస్తున్నా, తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈనెల 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానుండగా, ఆ లోపే విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తి చేసుకోవలసి ఉన్నా సరైన స్పందన లభించడంలేదు. జిల్లా వ్యాప్తంగా 273 విద్యాసంస్థల బస్సులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 125 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఫిట్‌నెస్ పరీక్షలకు వెళ్తే అధికారులు బస్సులను సీజ్ చేస్తారేమోననే ఉద్దేశంతోనే వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. కండీషన్ లేని బస్సులపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝులిపించాల్సింది పోయి.. యాజమాన్యాలు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి ఫిట్‌నెస్ సరిగాలేని బస్సులకు సైతం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. అధికారుల తనిఖీల్లో అనేక బస్సుల్లో చాలా లోపాలు బయటపడుతుండటం గమనార్హం.

గ్రిల్స్ లేకుండా..

బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రత కోసం బస్సుకు మూడు వైపులా తప్పనిసరిగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ముఖ్యంగా పాఠశాలల బస్సుల్లో ప్రయాణించేది చిన్న పిల్లలు కావడంతో బస్సు కదిలేటప్పుడు కిటికీల నుంచి చేతులు బయటకు చాచకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. అవి లేకుంటే ప్రయాణ సమయంలో విద్యార్థులు చేతులు బయటపెడితే ఇతర వాహనాల ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.

డ్రైవర్ వివరాలు లేకుండానే..

కొన్ని బస్సుల్లో నిబంధనల ప్రకారం డ్రైవర్ సీటు వెనుక భాగంలో అందరికీ కనిపించేలా ఉండాల్సిన డ్రైవర్ వివరాలు లేనే లేవు. అవేమీ లేకుండా బస్సులను సామర్థ్య పరీక్షలకు తీసుకొస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నామమాత్రంగా ఫైర్ ఎస్టింగిషర్లు?

అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవించి బస్సులో మంటలు చెలరేగితే వాటిని ఆర్పేందుకు ఫైర్ ఎస్టింగిషర్లు అందుబాటులో ఉండాలి. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకొని బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్లు ఏర్పాటు చేయాలి. అయితే బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్స్ కనిపిస్తున్నప్పటికీ, నామమాత్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు ఇవీ..

- వాహనం ముందు, వెనుక భాగాల్లో 'స్కూల్ బస్సు', 'బడి పిల్లలున్నారు' అన్న వ్యాక్యాలు రాయాల్సి ఉంటుంది. పాఠశాల పేరు, ఫోన్ నంబర్, పూర్తి చిరునామా బస్సుకు ఎడమవైపు వెనుక భాగంలో కనిపించేలా రాయించాలి
- బస్సు పసుపు రంగులో ఉండాలి. ఆ రంగు స్పష్టంగా కనిపించాలి.
- బస్సు వేగం గంటకు 40కిలోమీటర్లకు మించకుండా లాక్ చేయాలి. 15 ఏళ్లు నిండిన బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లడానికి వీలులేదు.
- ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్లలోపు ఉన్నవారినే డ్రైవర్లుగా నియమించుకోవాలి. ప్రతీ మూడునెలలకోసారి కంటిచూపు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించాలి.
- బస్సులో ప్రాథమిక చికిత్స పెట్టె ఉంచాలి. అందులో కావాల్సిన మందులు ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలి.
- బస్సుకు కనీసం ఒక అటెండర్‌ను ఏర్పాటు చేయాలి. పిల్లలు ఎక్కేది, దిగేది డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కుంభాకార అద్దాలు అమర్చాలి.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు



అనుమతులు లేకుండా పాఠశాల యజమానులు బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటాం. పాఠశాలల పునఃప్రారంభం వరకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తాం.

– రంగారావు, ఆర్డీవో

ముందస్తు సాగుపై అనుమానాలా?

- అయితే, జిల్లా వ్యవసాయాధికారిని సంప్రదించండి

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు
89777 52780

తేదీ : **06 : 06 : 2025**

సమయం: శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు

సాక్షి ఫోన్ ఇన్



ఆదిరెడ్డి,
జిల్లా వ్యవసాయాధికారి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ముందస్తు సాగుకు సమాయత్తమయ్యే రైతులు, విత్తన ఎంపిక, భూసారం పెంపు తదితర అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం (ఈనెల6న) ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వరిలో ఏ రకమైన విత్తనం వినియోగిస్తే అధిక దిగుబడి వస్తుంది, పత్తి సాగులో తలెత్తే సందేహాలకు సమాధానాలు, ముందస్తు సాగుకు సన్నద్ధమయ్యే తీరు, నకిలీ విత్తనాల గుర్తింపు.. ఇలాంటి సమస్యలపై జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి దృష్టికి తెచ్చి నివృత్తి చేసుకోవచ్చు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత, ఉద్యోగులు



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో మొక్కలు నాటుతున్న సీఈవో అలోక్ సింగల్ తదితరులు

- ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత, ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింగల్

జ్యోతినగర్/ఫెర్టిలైజర్‌సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత, ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింగల్ అనారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీ రామగుండంలో ఈడీ పర్యావరణ ర్యాలీ అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్టీపీసీ రామగుండం– తెలంగాణ ప్రాజెక్టులు పర్యావరణ బాధ్యతలకు కట్టుబడి ఉన్నాయన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించడానికి సమష్టి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు జనపనార బ్యాగులు, పర్యావరణ పరిరక్షణ క్రమంలో నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు అందించారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, జనరల్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామగుండం ఎరువుల కర్మాగారంలో సీఈవో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. సీజీఎం ఉదయ రాజహంస, రమేశ్ ఠాకూర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌డీలర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్‌లోని రేషన్ డీలర్ తూకంలో మోసం చేస్తున్నాడని, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం లబ్ధిదారులతో కలిసి మాజీ కార్పొరేటర్ శంకర్‌నాయక్ షాప్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం ఆరు కిలోలకు నాలుగైదు కిలోల బియ్యం మాత్రమే ఇస్తున్నట్లు లబ్ధిదారులు శంకర్‌నాయక్‌కు తెలపడంతో వెంటనే షాప్ వద్దకు చేరుకొని పరిశీలించారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రక్తమోడిన రహదారులు

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు
- ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రహదారులు గురువారం రక్తమోడాయి. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపాయి. జగిత్యాల జిల్లా మల్యాల పరిధిలోని ముత్యంపేట వద్ద పెళ్లికారును డీసీఎం ఢీకొనడంతో చిన్నారి మృతి చెందగా.. పెళ్లి కుమారుడు సహా.. ఆరుగురు గాయపడ్డారు. ఇదే జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట శివారులో ట్రాక్టర్ బోల్తాపడి తండ్రి మృతి చెందగా.. కొడుకు గాయపడ్డాడు. మెట్‌పల్లిలోని వెల్లుల్ల రోడ్డులో ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు చనిపోయాడు. పెద్దపల్లి జిల్లా సుగ్లాంపల్లి వద్ద లారీ ఢీకొనడంతో దంపతులు చనిపోయారు. చిన్నారి గాయపడింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పరిధిలోని తుమ్మనపల్లి వద్ద రెండు లారీలు ఢీకొని ఒక డ్రైవర్ మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. - 10లో▸

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరం పాటుపడదామని, ఇందకనుగుణంగా మార్పు మన నుంచే మొదలు కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ వేణు, డీసీపీ కరుణాకర్‌తో కలిసి ‹ఎక్ పేడ్ మా కే నామ్› పేరిట మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తన తల్లి పేరిట మొక్కలు నాటి కాపాడాలన్నారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల్లోనూ ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గాలన్నారు. ప్రభుత్వోద్యోగులు తమ ఇళ్లలోనూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లా అటవీ అధికారి శివయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఎంఈవోలు, కాంప్లెక్సు హెచ్‌ఎంలు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన వర్క్‌షాపులో మాట్లాడారు. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డీఈవో మాధవి, సమన్వయ కర్త పీఎం షేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటి నీరుపోస్తున్న జిల్లా జడ్జి సునీత

పెద్దపల్లిరూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా గురువారం కోర్టు ఆవరణలో సెక్రటరీ స్వరూపరాణితో కలిసి మొక్కలు నాటారు. కరోనా కాలంలో అవసరమైన ఆక్సిజన్ కోసం డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చిన పరిస్థితిని గుర్తు చేశారు. మళ్లీ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అందరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, లోక్‌అదాలత్ సభ్యుడు శ్రీధర్‌తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి.. ఆర్థిక భారం

పంచాయతీ పాలకవర్గాలు లేక కార్యదర్శులు అన్నీతామై పనులు చక్కబెడుతున్నారు. ఒకవైపు ప్రజాప్రతినిధులుగా, మరోవైపు ప్రభుత్వ సారథులుగా ఒకేసమయంలో రెండు విధులూ నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా పనిఒత్తిడితోపాటు ఆర్థికంగా సతమతమవుతున్నారు. అయినా, వీరిగోస పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన చెందుతున్నారు.

- సతమతమవుతున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు
- తమ గోస పట్టించుకునే వారు లేరంటూ పలువురి ఆవేదన



పన్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

రామగిరి(మంథని): గతేడాది ఫిబ్రవరిలో గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆ భారం కూడా పంచాయతీ కార్యదర్శులే మోయాల్సి వస్తోంది. రోజువారి విధులతోపాటు సర్వేలు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా తయారీ, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతరత్రా సమస్యల పరిష్కారం, వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం తలకు మించిన భారంగా మారుతోంది.

జిల్లాలో 266 పంచాయతీలు..

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరి ఒకటిన పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రభుత్వం మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. సర్పంచుల స్థానంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే, నిధులు లేకపోవడంతో వీధిదీపాలు, పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు సొంతంగా నిధులు సమకూర్చుకుంటున్నారు. ఉదయం 9 గంటల్లోపే గ్రామాలకు చేరుకుని లైవ్ లొకేషన్ ద్వారా వారి ఫొటోలను ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తున్నారు. ఏమాత్రం సమయం మించిపోయినా అధికారుల చీవాట్లు తప్పడంలేదు.

తప్పని రాజకీయ నాయకుల ఒత్తిళ్లు..

పనిభారంతో సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ రకాలుగా ఒత్తిళ్లు చేస్తున్నారు. ప్రధానంగా కొందరు మాజీప్రజాప్రతినిధులు ఇప్పటికీ తాము అధికారంలో ఉన్నామనే భావనతో ఆస్తిపన్ను, నీటిబిల్లులు, లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని తరచూ ఒత్తిడి చేస్తున్నారు. పన్నులు, బిల్లుల వసూళ్లలో నిర్దేశిత లక్ష్యం చేరుకోక అటు ఉన్నతాధికారుల నుంచి కూడా వారు చీవాట్లు పడుతుండగా, నాయకుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొందరు మనస్తాపానికి గురవుతున్నారు.


మరమ్మతులకు సొంత డబ్బులు..

గ్రామాల్లో వాటర్‌పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతు, పంచాయతీ ట్రాక్టర్ నెలవారీ బ్యాంక్ కిస్తీలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, బ్యాంక్ ఇన్‌స్టాల్‌మెంట్, విద్యుత్ బిల్లుల చెల్లింపులు కూడా పంచాయతీ కార్యదర్శులు తమ జేబుల్లోంచి చెల్లిస్తున్నారు. ఇలా ఇప్పటికే ఒక్కో పంచాయతీ కార్యదర్శి సుమారు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వివిధ పనులకు వెచ్చించారని సమాచారం.

డిపార్ట్‌మెంట్‌కు సంబంధం లేని పనులు

గతంలో కార్యదర్శులు గ్రామ పంచాయతీ విధులే నిర్వర్తించేవారు. ఆస్తిపన్ను వసూలు, పంచాయతీ ఆదాయవ్యయాల నిర్వహణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి నిర్మాణ అనుమతుల మంజూరు, పాలకవర్గ సమావేశాల తీర్మానాలు, పారిశుధ్య నిర్వహణ లాంటి పనులను చేసేవారు. ఇప్పుడు అదనంగా ప్రకృతి వనాలు, శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణాల నిర్వహణ తదితర పనులు చేయాల్సి వస్తోంది. అంతేకాదు.. కులగణన, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, భూముల సర్వే తదితర పనులకూ అధికారులు పురమాయిస్తున్నారు. అసలు తమ శాఖకు సంబంధం లేని పనులు చేయాల్సి రావడంతో పంచాయతీ కార్యదర్శులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

సెలవుల్లోనూ విధులు



ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను విజయవంతం చేయడానికి రాత్రింబవళ్లు పనిచేస్తున్నాం. సెలవు రోజులు, పండుగ సమయాల్లోనూ విధులు నిర్వర్తిస్తున్నాం. కుటుంబాలకు దూరంగా ఉంటున్నాం. మా శాఖకు సంబంధం లేనిపనులు కూడా అప్పగించడంతో పనిభారం పెరుగుతోంది.

– ఎడిపల్లి సంతోష్, కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పెద్దపల్లి

నిధులు నిలిచిపోయాయి



గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేవు. ఫలితంగా వివిధ రూపాల్లో రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. అత్యవసర పనులు చేయలేక కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వీరబుచ్చయ్య, డీపీవో

ఇంటర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కనీస మౌలికవసతులు కల్పించాలని, నిబంధనలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేశ్ అన్నారు. ఇంటర్ కాలేజీల సమస్యలను వివరించేందుకు నోడల్ అధికారి ఆఫీసు వెళ్లగా అధికారి అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, ఒకేషనల్ వారికి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. నాయకులు ఆయాన్, శ్రీరామ్, చరణ్, దేవేందర్, రాహుల్ తదితరులున్నారు.

డీఈఈటీ ద్వారా ఉపాధి అవకాశాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో డిజిటల్ ఎంప్లాయీమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) ద్వారా ఉపాధి అవకాశాలను ప్రోత్సహిస్తున్నామని జిల్లా పరిశ్రమల మేనేజర్ కీర్తికాంత్ తెలిపారు. జిల్లా కేంద్రం పెద్దపల్లిలోని ఎస్‌ఆర్‌ఆర్ రాఖీ తయారీదారుల సంస్థ ఈ రంగంలోకి తొలిసారిగా ప్రవేశించి ఉద్యోగ ప్రకటనలు చేసే తొలి యజమానిగా అవతరించిందన్నారు. ప్రస్తుతం వివిధ స్థాయిల్లో 50వరకు ఉద్యోగ ఖాళీలను ప్రకటించిందని, వివరాలు డీఈఈటీ ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. డీఈఈటీ ద్వారా నిరుద్యోగులు తమ ఆలోచనలకు అనుగుణమైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని వివరించారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


బాల ఎల్లయ్య మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి శివారులోని జగదాంబ వైన్స్ వద్ద బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన అందె బాలఎల్లయ్య (52) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి భార్య అంజవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు. బాల ఎల్లయ్య దినసరి కూలీగా పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం సాయంత్రం బయటకు వెళ్లిన బాల ఎల్లయ్య రాత్రి 9.30 గంటల ప్రాంతంలో వైన్స్ వద్ద అచేతన స్థితిలో పడి ఉన్నాడని తెలుసుకున్న భార్య అంజవ్వ అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించింది. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తన భర్త మరణంపై అనుమానాలు ఉన్నాయని అంజవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

మల్యాల: అప్పుల బాధ భరించలేక ఇంటి నుండి వెళ్లిపోయిన వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. మల్యాల ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటున్న నాగరాజు (39) రూ.4లక్షల అప్పు కావడంతో, తీర్చే మార్గం కానరాక, బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం రాత్రి మల్యాల గ్రామ శివారులోని వ్యవసాయబావిలో శవమై తేలాడు. అప్పుల వాళ్లు ఎవరూ బాధ పెట్టవద్దని సూసైడ్ నోట్ రాసి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారని, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడలో బెజ్జారపు తార ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. తార బుధవారం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లింది. తిరిగి గురువారం రాగా, తాళం పగుల గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా..ఇంట్లో దాచి ఉంచిన తులం బంగారు పుస్తెల తాడు, మూడు గ్రాముల బంగారు విగ్రహం చోరీకి గురైనట్లు గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



పెళ్లింట విషాదం

- పెళ్లి బృందం కారును ఢీకొన్న డీసీఎం
- నాలుగు నెలల బాలుడు మృతి
- పెళ్లి కుమారుడితోపాటు ఆరుగురికి తీవ్ర గాయాలు
- జగిత్యాల జిల్లా ముత్యంపేట వద్ద ఘటన
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిలిచిపోయిన వివాహం


మృతిచెందిన నాలుగు నెలల బాలుడు రుద్ర


డ్రైవర్ చందు


చికిత్స పొందుతున్న శీతల్


తీవ్రంగా గాయపడిన దినేశ్

మల్యాల: తెల్లవారితే పెళ్లి.. ఓ పక్క అమ్మాయి ఇంట్లో అంతా సిద్ధం చేస్తుండగా.. పెళ్లి కొడుకు మండపానికి బయల్దేరాడు. ఎంతో సంబురంగా సాగుతున్న వారి ప్రయాణంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. పెళ్లి కొడుకు బృందం ప్రయాణిస్తున్న కారును మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం ఎదురుగా ఢీకొంది. నాలుగు నెలల చిన్నారి మృతిచెందగా.. పెళ్లి కుమారుడితోపాటు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులో జగిత్యాల– కరీంనగర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున చోటు చేసుకుంది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో వధువు ఇంట్లో జరగాల్సిన వివాహం నిలిచిపోయింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌లోని చిక్కులవాడీలో నివాసముంటున్న మెట్‌కార్ హరి– లక్ష్మీబాయి దంపతుల కుమారుడు మహేశ్ వివాహం కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ బోర్నపల్లికి చెందిన సమీప బంధువు కంది నవ్యతో కుదిరింది. గురువారం వివాహం జరగాల్సి ఉండగా.. నాందేడ్ నుంచి పెళ్లి కొడుకు మహేశ్, అక్కాచెల్లెలు, బావతో కలిసి కారులో, తల్లిదండ్రులు, బంధువుల మరో రెండు డీసీఎం వ్యానుల్లో బుధవారం రాత్రి 8 గంటలకు బయల్దేరారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులోకి రాగానే గురువారం వేకువజామున 3.30గంటల ప్రాంతంలో జగిత్యాల– కరీంనగర్ జాతీయ రహదారిపై కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం కారును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, కారులో ప్రయాణిస్తున్న పెళ్లి కుమారుడు మహేశ్‌తోపాటు, అతని చెల్లెలు శీతల్, బావ దినేశ్, మరో అక్క మారుబాయి, సోనాలి, కారు డ్రైవర్ చందూ తీవ్రంగా గాయపడ్డారు. నాలుగు నెలల చిన్నారి రుద్ర చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన పెళ్లిబృందం కారు

మరో మూడు నిమిషాలు ఆగి ఉంటే

మల్యాల అడ్డరోడ్డు నుంచి ప్రమాదం జరిగిన స్థలం కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉండగా, మరో మూడు నిమిషాలు ఆలస్యంగా బయలుదేరి ఉంటే, ప్రమాదం నుంచి బయటపడేవారని బంధువులు రోదించారు. పెళ్లి బృందం కారు మల్యాల అడ్డరోడ్డుకు చేరుకునేసరికి వేకువజామున సుమారు 3.30 అవుతుండగా, రెండు డీసీఎం వ్యానుల్లోని బంధువులు, రెండు కార్లలోని పెళ్లికుమారుడు, కుటుంబ సభ్యులు అడ్డరోడ్డు వద్ద టీ తాగి బయలుదేరిన మూడు నిమిషాలకు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెళ్లికుమారుడు, కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంటిదారి పట్టడంతో హుజూరాబాద్‌లో జరగాల్సిన వివాహం నిలిచిపోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.

పెళ్లికి వెళ్తూ.. మృత్యు ఒడికి

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి
- వృద్ధురాలిని తప్పించబోయి దంపతులపైకి దూసుకెళ్లిన లారీ
- తీవ్ర గాయాలతో బయటపడిన మూడేళ్ల చిన్నారి


రాము, అనూష (ఫైల్)

సాక్షి పెద్దపల్లి: పెళ్లి ఇంటికి చేరుకోవాల్సిన దంపతులను లారీ రూపంలో వచ్చిన మత్యువు కబళించింది. జీవితంలోనే కాదు... మరణంలోనూ తమ బంధం విడదీయరానిదంటూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వృద్ధురాలిని తప్పించబోయి, దంపతుల బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లి వద్ద రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రమాదంలో దంపతులు మతిచెందగా, మూడేళ్ల కూతురు తీవ్ర గాయల పాలైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై శ్రావణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన డ్రైవర్‌గా పనిచేస్తున్న గుంటిపల్లి రాము(30) భార్య అనూష (27), కూతురు సహస్ర(03)లు కలిసి హుజూరాబాద్‌లోని బంధువుల పెళ్లికి వెళ్లాడానికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈ క్రమంలో సుగ్లాంపల్లి వద్దకు రాగానే పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీకి వృద్ధురాలు అడ్డుగా రావడంతో లారీ డ్రైవర్ ఆమెను తప్పించబోయాడు. దీంతో లారీ డివైడర్ ఎక్కి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో భార్య అనూష అక్కడికక్కడే మృతిచెందగా, భర్త సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు.. కూతురుకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐలు సుబ్బారెడ్డి, అనిల్లు అసుపత్రికి వచ్చి వివరాలను ఆడిగి తెలుసుకున్నారు.

బసంత్‌నగర్‌లో విషాదం

పాలకుర్తి: మరో రెండు రోజుల్లో బావమరిది వివాహం. ఎంతో సంబరంగా బయలుదేరిన భార్యాభర్తలు మార్గమధ్యంలో మృత్యువు కబలించడంతో బసంత్‌నగర్‌లో విషాదం నెలకొంది. తీవ్రంగా గాయపడ్డ చిన్నారి సహస్ర చావుబతుకులమధ్య వరంగల్ ఎంజీఎంలో పోరాడుతోంది. బసంత్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన గుంటుపల్లి రాము స్థానికంగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నప్పుడే తండ్రి కుమారస్వామి చనిపోగా, తల్లి పద్మ కాయాకష్టం చేసి కొడుకు రాము, బిడ్డ రమ్యను ఎంతో అల్లారుముద్దుగా పెంచింది. కొడుకు, కోడలు చనిపోయిన వార్త విన్న తల్లి పద్మ రోదనలు అక్కడున్నవారిని కంటతడిపెట్టించాయి.

కిడ్నాప్ కథ సుఖాంతం

- పోలీసుల అదుపులో కిడ్నాపర్లు
- రూ.30లక్షల కోసమే వృద్ధుడి అపహరణ
- చాకచక్యంగా కాపాడిన పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలో కలకలం సృష్టించిన వృద్ధుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సోమవారం రాత్రి కిడ్నాపర్లు అపహరించుకుపోగా.. బుధవారం కోరుట్లలోని ఓ ఇంట్లో దాచి ఉంచిన వృద్ధుడిని కాపాడి, మరో ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాప్‌లో ప్రధాన సూత్రదారులు ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. ముస్తాబాద్ ఎస్సై చిందం గణేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన జంపెల్లి మల్లయ్య (72)ను గత సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని భార్య మల్లవ్వ ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాల ద్వారా కిడ్నాపర్లు కోరుట్లలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి ఓ ఇంట్లో కిడ్నాపర్ల చెరలో ఉన్న మల్లయ్యతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. మల్లయ్య కుమారుడు జంపెల్లి పర్శరాములుకు దుబాయ్‌లో కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన బోయిని రాజేందర్ రూ.30లక్షలు ఇచ్చాడని, అడిగితే ఇవ్వడం లేదని తెలిపారు. డబ్బుల కోసం గూడూరుకు వచ్చిన రాజేందర్‌కు పర్శరాములు దొరక్కపోవడంతో ఆయన తండ్రి మల్లయ్యను అపహరించినట్లు అంగీకరించారు. బోయిని రాజేందర్‌తోపాటు అతనికి సహకరించిన మర్తనపేటకు చెందిన కలకోట రవి, సిరిసిల్లకు చెందిన సందడికాడి సతీశ్, కారుడ్రైవర్ సుమన్‌లపై కేసు నమోదు చేశారు. రాజేందర్‌తోపాటు కలకోట రవి, సతీశ్‌లను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు డ్రైవర్ సుమన్ పరారీలో ఉన్నారు. కిడ్నాపర్లను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజశేఖర్, ఖాసీంలను ఎస్సై అభినందించారు.

ఉద్యమనేతల మాటముచ్చట


సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు, ఉద్యమనేతలు అమర్, చలపతిరావుల పలకరింపులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటాల నేపథ్యం వారిది. ఒకరు పాటతో చైతన్యం కలిగిస్తే.. మరొకరు బోధనలతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపారు. బడుగు, బలహీనవర్గాల తరపున నేనున్నానంటూ పిడికిలి ఎత్తిన నేత మరొకరు.. వీరందరూ గురువారం ఒక్కచోట చేరారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కుమారుడు అభిలాశ్ –శివాని వివాహం జరిగింది. ఈ పెళ్లికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీలు కోదండరాం, నెల్లికంటి సత్యం, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జనశక్తి అగ్రనేత అమర్, విమలక్క, మాజీ ఎమ్మెల్యే చలపతిరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు పెళ్లి మండపంలో కలుసుకున్నారు. కుశలప్రశ్నలు వేసుకుంటూ గడిపారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు

కరీంనగర్ అర్బన్: పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలచేశారని కరీంనగర్ పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. కోర్సులో ప్రవేశం కొరకు పదోతరగతి లేదా దానికి సమానమైన పరీక్షలో ఉతీర్ణులై (టీజీ పాలిసెట్ 2025) ఎంబైపీసీలో ర్యాంకుపొంది ఉండాలని పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీ పరిధిలో మూడు పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలు కరీంనగర్, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 99 సీట్లు ఉన్నాయని వివరించారు. కోర్సుల్లో చేరడానికి ఆసక్తిగల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొని ఈ నెల 24 సాయంత్రం 5గంటల లోపు విశ్వవిద్యాలయంకు దరఖాస్తు చేయవచ్చని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు. ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేటు రంగంలో డెయిరీ ఫార్మ్, పౌల్ట్రీ ఫార్మ్, పెట్ హాస్పిటల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు.

'లక్కీ' లాటరీ మోసాలపై స్పందించండి

- నివేదిక ఇవ్వాలని సీపీకి హెచ్ఆర్సీ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: లక్కీలాటరీ మోసాలపై ఎట్టకేలకు మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) స్పందించింది. కరీంనగర్ వేదికగా పలుకంపెనీలు కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాలలోని మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని లక్కీ లాటరీలు నడిపి ప్రజలను మోసం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని 2022 అక్టోబరులో 'లక్కీ లాటరీ మోసాలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఉచిత బహుమతులు, నగదు బహుమతులు ఇస్తామంటూ పేదలకు ఆశచూపించి వారి నుంచి రూ.కోట్లు కాజేసి పరారయ్యారు. ఈ విషయంలో పోలీసులు సరిగా వ్యవహరించలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో కరీంనగర్‌కు చెందిన ఇమ్రాన్ అనే యువకుడు మానవ హక్కుల కమిషన్‌ని ఆశ్రయించాడు. దీంతో జరిగిన ఘటనపై ఈనెల 24వ తేదీలోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కరీంనగర్ సీపీకి హెచ్ఆర్సీ ఆదేశించింది.

రాజన్న గోశాలలో మరో రెండు కోడెలు మృతి

వేములవాడఅర్బన్: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం తిప్పాపూర్‌లోని గోశాలలో గురువారం అనారోగ్యంతో మరో రెండు కోడెలు మృతిచెందినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. అకాలవర్షాలు, అనారోగ్య పరిస్థితులతో గోశాలలో ఇప్పటి వరకు 28 కోడెలు మృతి చెందినట్లు వివరించారు. గోశాలలో ఉన్న 1,300 కోడెలలో ప్రస్తుతం 12 కోడెలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. వీటికి వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

దాణాపూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి కిందపడిన యువకుడు


గాయపడిన సంతోష్

ఓదెల(పెద్దపల్లి): సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి కిందపడిన యువకుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాలు.. గురువారం గోదావరిఖనికి చెందిన కంకణాల సంతోష్ రామగుండం వచ్చేందుకు కాజీపేట్‌లో దాణాపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి డోర్ వద్ద కూర్చున్నాడు. పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. బ్లూకోల్ట్ పోలీసులు శంకర్, శివశంకర్ వెంటనే స్పందించి పట్టాల మధ్య ఉన్న సంతోష్‌ను బయటకు తీసుకువచ్చి అంబులెన్స్‌లో సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు.

లారీలు ఢీ.. ఒకరు మృతి


లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు, స్థానికులు

హుజూరాబాద్: ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న తుమ్మనపల్లి గ్రామం మీదుగా వెళ్తున్న వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరగగా.. ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి కృష్ణకిషోర్(44) లారీని ఎదురుగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. కృష్ణకిశోర్ లారీ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతి కష్టమ్మీద క్షతగాత్రుడికి బయటికి తీసి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. లారీ క్లీనర్ మస్తాన్, మరో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు లారీలు బ్రిడ్జిపై ఢీకొనగా.. అటు వరంగల్, ఇటు కరీంనగర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సీఐ కరుణాకర్‌నడిగి తెలుసుకున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువరైతు..


చెదలి ప్రవీణ్ మృతదేహం

మల్లాపూర్: వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెదలి ప్రవీణ్(30)కు భార్య రమ్య, ఇద్దరు కొడుకులున్నారు. గ్రామశివారులోని తన వ్యవసాయ భూమిని చదును చేసేందుకు పెద్ద కుమారుడు శ్రీహాన్‌తో కలిసి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శ్రీహాన్‌ను స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రాజు తెలిపారు.


బోల్తా పడిన ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు..


రవి(ఫైల్)

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో గురువారం రాత్రి ఇసుక ట్రాక్టర్ ఢీకొని బండలింగాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల రవి మృతి చెందాడు. రవి ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వచ్చి తిరిగి బండలింగాపూర్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో పట్టణ శివారుకు చేరుకోగానే, ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని రోదించారు.

తండ్రిని హతమార్చిన తనయుడు


తొట్ల ఎర్రయ్య మృతదేహం

రాయికల్: రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో తొట్ల ఎర్రయ్య(65)ను కన్న కొడుకే గొడ్డలితో దారుణంగా హతమార్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో తొట్ల ఎర్రయ్య కొడుకు మల్లేశ్‌తో కలిసి జీవిస్తున్నాడు. చిన్నప్పుడే తల్లి చనిపోగా.. మల్లేశ్ మానసిక పరిస్థితి సరిగా లేదు. కొడుకు ఆలన పాలన తండ్రి ఎర్రయ్య చూసుకుంటున్నాడు. మానసిక స్థితి సరిగా లేని మల్లేశ్ బుధవారం అర్ధరాత్రి తన తండ్రిపై గొడ్డలితో తీవ్రంగా దాడిచేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సందర్శించారు. సంఘ నాయకుడు నాగుల గంగ మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకున్న వ్యక్తి

- హైరానా పడ్డ పోలీసులు


పోలీస్‌స్టేషన్‌లో హంగామా చేస్తున్న వ్యక్తి

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి మద్యంమత్తులో పెట్రోల్ పోసుకుని హంగామా సృష్టించాడు. పాత బస్టాండ్ ప్రాంతంలో అరటి పండ్లు అమ్ముకునే వ్యక్తి గురువారం సాయంత్రం అతిగా మద్యం సేవించి పెట్రోల్ బాటిల్‌తో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. శరీరంపై పెట్రోల్ పోసుకుని హంగామా చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ బాటిల్ లాక్కొని అతని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. పారిపోయేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు.

ఎస్సెస్సీ బోర్డు తప్పిదం.. విద్యార్థినికి అన్యాయం

- రీ వెరిఫికేషన్‌లో 20 మార్కులు పెంపు


వర్షిత

రామగిరి(మంథని): ఎస్సెస్సీ బోర్డు అధికారుల తప్పిదంతో విద్యార్థినికి అన్యాయం జరిగింది. రామగిరి మండలం బేగంపేటకు చెందిన సిరిపురం వర్షిత సెంటినరికాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదివింది. వార్షిక పరీక్షల్లో 567 మార్కులు సాధించింది. చదువులో మొదటి స్థానంలో ఉండే వర్షిత తనకు వచ్చిన మార్కుల పట్ల సంతృప్తి చెందక బోర్డు అధికారులకు రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. బోర్డు ఆదేశాలతో మరోసారి పరిశీలించగా అసలు తప్పిదం బయటపడింది. పార్ట్–బీ పేపర్ కౌంట్ చేయలేదని గుర్తించి ఇప్పుడు 20 మార్కులు కలిపి మొత్తం 587 మార్కులుగా బోర్డు నుంచి మార్కుల మెమో అందజేశారు. రీ వెరిఫికేషన్‌లో 20 మార్కుల పెంపుతో వర్షిత జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. అధికారుల తప్పిదం వల్ల తమ బిడ్డకు తీవ్ర అన్యాయం జరిగిందని వెంటనే బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొండగట్టులో విజిలెన్స్ తనిఖీలు

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. లడ్డూ, ప్రసాదాల తయారీలను పరిశీలించారు. లడ్డు తయారీ విధానం, లడ్డుల సామగ్రి, రికార్డులు, లడ్డు బరువు పరిశీలించారు. అనంతరం ఆలయ కార్యాలయానికి వెళ్లి, 2023– 24లో టెండర్లలో అవకతవకలపై ఆరా తీశారు. ఈ మేరకు టెండర్ల రికార్డులు ఇవ్వాలని కోరగా, ఈఓ శ్రీకాంత్ రావు అందుబాటులో లేరని అధికారులు చెప్పడంతో ఈఓతో ఫోన్‌లో మాట్లాడగా, తాను వచ్చిన తర్వాత టెండర్ల రికార్డులు అందజేస్తామని సమాధానం చెప్పినట్లు తెలిసింది. గతంలో టెండర్ల గోల్‌మాల్‌తో పాటు, ఆలయంలో జరిగిన వెండి, బంగారం దొంగతనంపై ఆరా తీసినట్లు తెలిసింది.

రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా చామనపల్లి


మంత్రి సురేఖ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న కార్యదర్శి మహేందర్‌రావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డు సాధించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావు ఉత్తమ పంచాయతీ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ అవార్డు కోసం మూడు గ్రామపంచాయతీలు ఎంపిక చేయగా చామనపల్లి పంచాయతీకి మొదటి స్థానం లభించింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛత, పర్యావరణం, పచ్చదనం. సెగ్రేషన్‌షెడ్, కంపోస్టు ఎరువుల తయారీ, విటమిన్ గార్డెన్, ప్లాంటేషన్, కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాల్లో చామనపల్లి పంచాయతీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్‌రావు, పంచాయతీ సిబ్బందిని మంత్రి సురేఖ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, టీఎస్ పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి తదితరులు పాల్గొన్నారు.